క్లుప్తంగా

రూ. 4 లక్షలతో రోడ్డు, ర్యాంప్ పనులు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కొండ ప్రాంతాల్లో నివసించే వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నానని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మీ తెలిపారు. 48వ డివిజన్ ఆంజనేయ వాగు తమ్మిన పోతరాజు విగ్రహం వీధిలో రూ. 4 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శుక్రవారం కార్పొరేటర్ పూజా కార్యక్రమలు నిర్వహించి ప్రారంభించారు. తమ్మిన పోతరాజు వీధితో పాటు ర్యాంప్ నిర్మాణం చేపట్టాలని స్థానికుల కోరిక మేరకు పనులను చేపట్టామని తెలిపారు. స్థానికుల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా పనులలో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, తొత్తడి వరలక్ష్మీ, దుక్కా హరి భాస్కర్, బాయన అమర్‌నాథ్, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

24న వైద్య ఆరోగ్యశాఖ మెగా రక్తదాన శిబిరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన మెగా రక్త దాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. 24 వతేదీ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ కొత్తపేట కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఆ కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లపై జిల్లా వైద్యాశాఖ అధికారులు శుక్రవారం పరిశీలన చేసి స్థానిక అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఏటీవో డాక్టర్ ఉషారాణి, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం అధికారి డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని వినతి



భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం కుమ్మరి పాలెం సెంటర్ నుంచి కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలోగల వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద సిటీ బస్ స్టాప్ షెల్టర్ ఏర్పాటు చేయాలని 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విద్యాధరపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావును శుక్రవారం డిపోలో కలిసి వినతి పత్రం అందచేశారు. గతంలో స్థానిక రావిచెట్టు సెంటర్‌లో బస్ స్టాప్ షెల్టర్ ఉండేదని, అయితే కనకదుర్గ ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో దానిని తొలగించారని గుర్తు చేశారు. అనంతరం కుమ్మరిపాలెం సెంటర్‌లో ఒక బస్ స్టాప్ షెల్టర్ (అప్‌లో) ఏర్పాటు చేసినప్పటికీ అది నిరుపయోగంగా ఉందని, దానిని అక్కడ నుంచి తొలగించి హెల్త్ సెంటర్ వద్దకు మార్చాలని విన్నవించారు. లేదా దానిని అక్కడే ఉంచి కొత్తగా హెల్త్ సెంటర్ వద్ద మరొకటి ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

వార్డు వలంటీర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో ఖాళీగా ఉన్న 1407 మంది వార్డు వలంటీర్ల ఎంపికకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఈ నెల 20 నాటికి 18–35 ఏళ్ల వయస్సుల వారు, నగరంలో నివాసం ఉండే వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ పూర్తి విద్యార్హతలు, ఇతర ధృవీకరణ పత్రాలతో హెచ్‌టీటీపీ://40.81.211.107.ఏపీవాలంటీర్20/ఏపీవాలంటీర్0904202049.బీటీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) లేదా వార్డు సెక్రటరీ స్పెషల్‌సెల్ నంబర్ 8185933187 నంబర్లో సంప్రదించాలని కోరారు.

గోశాలకు విరాళం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో గోశాల నిర్వహణ, అభివృద్ధికి శుక్రవారం దాత పి.కామేశ్వర శర్మ దంపతులు రూ.1.12 లక్షలు మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. దాతలు మాట్లాడుతూ మందిరంలో నిర్వహిస్తున్న గోశాల నిర్వహణ, అభివృద్ధికి తన వంతు బాధ్యతగా విరాళం అందజేస్తున్నామని చెప్పారు. గౌతంరెడ్డి మాట్లాడుతూ సకల దేవతల స్వరూపమైన గోవుల పరిరక్షణకు తాము గోశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతలకు బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు.

చురుగ్గా కమ్యూనిటీ హాల్ నిర్మాణం

- రూ.61 లక్షల అంచనా వ్యయం
- డివిజన్‌లో తొలి కమ్యూనిటీ హాల్

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోగల రోటరీనగర్ అభివృద్ధి పథాన నడుస్తుంది. గత ప్రభుత్వ హయాంలో చిన్నపాటి వర్షం కురిసినా ముంపుకు గురయ్యే రోటరీనగర్‌వాసులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మోక్షం లభించింది. ఇప్పటికే ఇక్కడ మెయిన్ రోడ్‌తోపాటు పలు అంతర్గత రోడ్లు, అలాగే లోతట్టులో ఉన్న భగత్‌సింగ్‌నగర్ రోడ్డు ఎత్తు పెంచుతూ ముంపు బారిన పడకుండా సీసీ రోడ్లు నిర్మించారు. డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షతో స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య చేస్తున్న కృషికి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అందిస్తున్న సహకారంతో పలు అభివృద్ధి పనులు జరిగాయి. ఇందులో భాగంగానే రోటరీనగర్ చివర ఉన్న నగరపాలక సంస్థ స్థలంలో రూ.61 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ ఖాళీ స్థలాన్ని కబ్జా చేసేందుకు కూడా ప్రయత్నించారు. అయితే స్థానికులు అడ్డం పడటంతో అది సాధ్యం కాలేదు.

పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనకరం...

డివిజన్ పరిధిలో సుమారు 25వేల మంది నివసిస్తుండగా వారిలో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి ప్రజలు ఉన్నారు. వివాహాది శుభకార్యాలతోపాటు చిన్నచిన్న ఫంక్షన్లు చేసుకోవాలన్నా ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్ అద్దెలు కట్టలేని పరిస్థితి. దాంతో వారు ఇళ్ల ముందే రోడ్లపై చేసుకోవల్సి వస్తుంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఈ కమ్యూనిటీ హాల్ పూర్తయితే నిర్వహణ నిమిత్తం నామమాత్రపు చార్జీలతో వారికి అందుబాటులోకి వస్తుంది. డివిజన్ పరిధిలో ఎక్కువ భాగం కొండ ప్రాంతం ఉంది.

కొండ ప్రాంతంలో మెట్లు, డ్రెయిన్స్, తాగునీరు, వీధి లైట్లు వంటి మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తున్నాం. త్వరలో పూర్తి కానున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో కొండ ప్రాంతవాసులతోపాటు డివిజన్ పరిధిలోని రోటరీనగర్, బ్రహ్మయ్యకాలనీ, భగత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.



రోటరీనగర్‌లో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్

సదుపాయాలు కల్పిస్తున్నాం



డివిజన్‌లో నివసిస్తున్న పేద, మధ్య తరగతి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడంతోపాటు సత్వరమే పరిష్కరిస్తున్నాం. డివిజన్‌లో ఏ సమస్య ఎదురైనా వెంటనే స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్తున్నాం. కొండ ప్రాంతంలో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం. కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేశాం.

– మైలవరపు మాధురి లావణ్య, 45వ డివిజన్ కార్పొరేటర్


నేత్రపర్వంగా వాహన సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):బాలగణపతి స్వామి వారు శ్రీ వాంఛకల్పలతా గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాతబస్తీ పూజారి వారి వీధిలోని బాలగణపతి ఆలయంలో స్వామి వారి వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా స్వామి వారి సన్నిధిలో శుక్రవారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభించారు. అనంతరం సహస్రనామార్చన నిర్వహించారు. అలాగే స్వామి వారికి సహస్ర మోదక (ఉండ్రాళ్ళ) పూజ నిర్వహించారు. స్వామి వారికి చేసిన అలంకారం చూడముచ్చటగా ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అలాగే స్వామి వారి వాహన సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవాయిద్యాలు, స్వామి వారి నామకీర్తనలతో వాహన సేవను నిర్వహించారు. పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీ వెంకటకృష్ణారావులు పర్యవేక్షించారు.

మధ్యాహ్నం అమ్మవారికి సామూహిక లక్షకుంకుమార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుమారు రెండు వందల మంది మహిళలు పాల్గొన్నారు. లలితా సహస్రనామాలతో అర్చనను వైభవంగా నిర్వహించారు. పూజలో పాల్గొన్న వారికి నిర్వాహకులే పూజా సామాగ్రి ఇతర నివేదన వస్తువులు అందించారు. కార్యక్రమాన్ని ఆతుకూరి శ్రీదేవి పర్యవేక్షించారు. సాయంత్రం మణిదీప వర్ణన పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



సామూహిక లక్షకుంకుమార్చన



వాహన సేవలో స్వామి



శ్రీ వాంఛకల్పలతా గణపతిగా బాలగణపతి

దుర్గగుడి ప్రొవిజన్ స్టోర్స్‌లో తనిఖీలు

శాంపిల్స్ సేకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్న సరుకుల శాంపిల్స్‌ను ఫుడ్ స్టేఫీ అధికారులు శుక్రవారం సేకరించారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు దేవస్థానం అందిస్తున్న అన్న ప్రసాదంతో పాటు ప్రసాదాల తయారీకి ఉపయోగించే సరుకులను తనిఖీ చేశారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ షేక్. గౌస్‌మొహిద్దీన్ తన సిబ్బందితో కలిసి ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మహా మండపం ఆరో అంతస్తులోని ప్రొవిజన్ స్టోర్స్‌ను తనిఖీ చేశారు. కాంట్రాక్టర్లు దేవస్థానానికి సరఫరా చేసిన పప్పులు, బియ్యం, పూజా సామగ్రి, ఇతర నిత్యావసర సరుకుల శాంపిల్స్‌ను సేకరించారు. నాణ్యత పరిశీలించిన అనంతరం వచ్చిన నివేదకను బట్టి చర్యలు ఉంటాయన్నారు. త్వరలోనే జిల్లా అధికారులతో దసరా ఉత్సవాల కోఆర్డినేషన్ సమావేశం నేపథ్యంలో ఈ తనిఖీలు జరిగినట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. గురువారం అర్జున వీధిలోని శృంగేరీ మఠంలోని అన్న ప్రసాదం తయారు కేంద్రంలో గోడౌన్‌ను అధికారులు పరిశీలించారు. గోడౌన్‌లో సరుకులు ఏ విధంగా నిల్వ చేస్తున్నారనే అంశాలతో పాటు గోడౌన్ పరిశుభ్రంగా ఉందా లేదా అనేది తనిఖీ చేశారు. గోడౌన్‌లో కొన్ని సరుకులను ఎలుకలు కొరుకుతుండటంతో వెంటనే వాటిని మరో గదిలో భద్రపరచాలని ఆదేశించారు.



శాంపిల్స్‌ను సేకరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

ఉత్సాహంగా కొనసాగుతున్న నిమజ్జనాలు

సందడిగా పాతబస్తీ రహదారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):గణేష్ నిమజ్జనాలు ఐదో రోజు అత్యంత వైభవంగా కొనసాగాయి. వీధి వీధినా ఏర్పాటుచేసిన గణనాథులు కృష్ణానదికి నిమజ్జనానికి తరలివెళ్తున్నారు. శుక్రవారం పెద్ద సంఖ్యలో నిమజ్జనాలు కొనసాగాయి. మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. వన్‌టౌన్‌లోని ప్రధాన రహదారులన్నీ కళకళలాడుతున్నాయి. జైబోలో గణేష్ మహారాజ్‌కీ జై అనే నినాదాలు వన్‌టౌన్‌లో మార్మోగుతున్నాయి. అడుగు నుంచి భారీ విగ్రహాలన్నీ వరుసగా కృష్ణానదికి తరలివెళ్తున్నాయి. ఈ సందర్భంగా ఆయా చవితి పందిళ్ల నిర్వాహకులు మేళతాళాలతో, కోలాట విన్యాసాలు, జానపద కళారూపాలతో నృత్యాలు చేసుకుంటూ సందడి చేస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి విగ్రహాలకు వన్‌టౌన్ మీదుగా కృష్ణానదికి తరలివెళ్లాల్సి రావడంతో ఈ ప్రాంతాలన్నీ సందడిగా దర్శనమిస్తున్నాయి. గవర్నరుపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలు ఫ్లైఓవర్, కెనాల్‌రోడ్డు, రథం సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా కృష్ణానదికి చేరుకుంటున్నాయి. కేటీరోడ్డు, మొయిన్‌బజార్, బ్రాహ్మణ వీధి, కెనాల్‌రోడ్డు తదితర ప్రాంతాల మీదుగా తరలివెళ్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలన్నీ ఊరేగింపులతో కిక్కిరిసి దర్శనమిస్తున్నాయి. కృష్ణవేణి హోల్‌సేల్ మార్కెట్‌లో వినాయకచవితి వేడుకలు శుక్రవారం ముగిశాయి. రాత్రి స్వామి వారి నిమజ్జన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మార్కెట్ అధ్యక్షులు బచ్చు వెంకటప్రసాద్ కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. భేతాళ నృత్యాలు, డప్పు విన్యాసాలు, డీజే శబ్దాలతో సందడి చేస్తూ ఊరేగింపు ముందుకు సాగింది. కార్యక్రమంలో వెలంపల్లి రాఘవ, వల్లంకొండ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జనానికి వెళ్తున్న గణనాథులు



భేతాళ నృత్య విన్యాసాలు

వేధింపుల భర్తపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ప్రేమించి పెళ్లి చేసుకుని భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వించిపేట సీఎస్ఐ చర్చి ప్రాంతానికి జిల్లీలా జ్యోతి గతంలో శ్రీనివాసరావును ప్రేమించి పెళ్లి చేసుకుంది. శ్రీనివాసరావుతో విభేదాలు రావడంతో విడిపోయి తల్లి వద్ద ఉంటున్న తరుణంలో కర్నూలు జిల్లా ఆళ్ళగడ్డకు చెందిన అనిల్‌కుమార్ పరిచయం కావడంతో అతనిని పెళ్లి చేసుకుంది. వీరికి ఒక పాప పుట్టింది. ఈ క్రమంలో 7 నెలల కిందట హైదరాబాద్‌లో ఉద్యోగం వచ్చిందని చెప్పి అనిల్ వెళ్లిపోయాడు. అప్పటి నుంచి పాప సంరక్షణ, తనను పట్టించుకోకుండా వదిలేయడంతో పాటు మరో వివాహానికి సిద్ధమవుతున్నాడని తెలిసింది. దీంతో తన భర్త వేధింపులపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఎన్నిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ఏపీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఎన్నిక విజయవాడలో శుక్రవారం జరిగింది. నగరంలో ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో నూతన రాష్ట్ర స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్.వీ రారెడ్డి, సీనియర్ పాస్ట్ ప్రెసిడెంట్‌గా బి.సురేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ యదిద్య, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ. వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి.సాంబశివరావు, డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ.రవికుమార్, జాయింట్ సెక్రటరీ సుబ్బారావు, శిరీష, ప్రేమ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఎస్.వెంకట్, ఎ.వెంకటేశ్వరరావు, జి.వెంకటేశ్వర్లు, రాయలసీమ ఇన్‌చార్జిగా ఈ బాలగౌడ్, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికయిన రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులను చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ అభినందించారు. అలాగే వచ్చే ఆరు నెలలో రాష్ట్రంలో 24 ట్రైనింగ్ క్యాంప్స్, 3 అంతర్జాతీయ పారిశ్రామిక సదస్సులు, 3 రాష్ట్ర స్థాయి బిజినెస్ ఎగ్జిబిషన్స్, 3 ఇండస్ట్రియల్ టూర్స్, 3 ఇంక్యూబేషన్ సెంటర్స్‌లను ఐఐటీ కాన్పూర్ సహకారంతో చేయటానికి కార్యాచరణ రూపొందించారు. జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గ కమిటీ వివరాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంబంధిత అధికార విభాగాలకు పంపిస్తామని తెలిపారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ):దైనందిన జీవితంలో ఆహారం కింద తీసుకుంటున్న రైస్ వాడకాన్ని తగ్గించి చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను తింటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సెక్టార్–1 సూపర్‌వైజర్ జి.ప్రశాంతి అన్నారు. పోషకాహార మాసోత్సవంలో భాగంగా శుక్రవారం విద్యాధరపురం గుప్తా సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ తల్లులు, గర్భిణులు చిరుధాన్యాలు తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. చిరుధాన్యాలను వివిధ రూపాల్లో తీసుకోవడం ద్వారా తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కె.లక్ష్మి, బి.నాగమణి, ఎస్‌కె జమీల, ఎమ్ఎస్‌కెలు శ్యామల, మహేశ్వరి, ఏఎన్ఎమ్ ఎస్‌కె రంజాన్ ఆయాలు పాల్గొన్నారు. విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని రామరాజ్యనగర్ – 1, 2, 3 సెంటర్లలో నిర్వహించిన పోషణ్ మా కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్–2 ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్ బి.లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాల్లో అనేక పోషక విలువలు ఉన్నాయని తెలిపారు. అవి ఆరోగ్య పరిరక్షణకు ఏ విధంగా దోహదపడతాయో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జి.పావని, కె.బాజీ, ఏఎన్ఎమ్ వెంకట రమణ, ఎమ్ఎస్‌కెలు వి.రాజ్యలక్ష్మి, పీవీఎస్ కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రామరాజ్యనగర్‌లో తల్లులు, గర్భిణులతో లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు

దసరా పనులకు ఆటంకం లేకుండా చూడాలి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా పనులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా కొండ చరియలు, మట్టి తొలగింపు పనులు వేగంగా చేయాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. దుర్గాఘాట్ ఎదుట ఇటీవల కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఘాట్‌రోడ్డు నుంచి కొండ దిగువకు జారిన మట్టి, కొండ చరియలను త్వరితగతిన తరలించాలని ఈఈ ఎల్. రమాదేవికి సూచించారు. దసరా ఉత్సవాలకు గడువు ముందుకు వస్తున్నందున పనులు వేగంగా జరగాలని సూచించారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన సిబ్బంది క్వార్టర్స్‌లో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలలో చైర్మన్ కర్నాటి రాంబాబు పాల్గొన్నారు. శుక్రవారం గుణదలలోని క్వార్టర్స్‌కు చేరుకున్న ఆయన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చవితి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు అన్న ప్రసాద వితరణను ప్రారంభించారు.



మట్టి, కొండ చరియలను పరిశీలిస్తున్న చైర్మన్ రాంబాబు

విజయేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా రాఘవ

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న విజయేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా వెలంపల్లి రాఘవ నరసింహారావు నియమితులయ్యారు. ఈ దేవస్థానానికి దేవదాయ ధర్మాదాయ శాఖ నూతన ధర్మకర్తల మండలిని నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు శుక్రవారం దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో దేవస్థానం నూతన పాలక మండలి ధర్మకర్తలైన పణుకు పణీంద్ర దూండీ, వద్దాది అనిత చేసిన ప్రతిపాదన మేరకు ధర్మకర్తల మండలికి చైర్మన్‌గా వెలంపల్లి రాఘవ నరసింహారావు, ధర్మకర్తలుగా చెవిటి శ్రీనివాసరావు, పొట్టి బాల వెంకట శ్రీనివాసరావు, పీతల పద్మ, రాజనాల విజయలక్ష్మి, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా సూర్య కుమార్ శర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ధర్మకర్తల మండలి నూతన సభ్యులతో దేవదాయ శాఖ ఎన్టీఆర్ జిల్లా ఇన్‌స్పెక్టర్ అనురాధ, దేవాలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన ధర్మకర్తల మండలి సభ్యులను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు పల్లపోతు మురళి కృష్ణ (కొండపల్లి బుజ్జి) అభినందించారు. నూతన చైర్మన్ వెలంపల్లి రాఘవ నరసింహారావు, ధర్మకర్తల మండలి సభ్యులు మాట్లాడుతూ విజయేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. తమపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, మైలవరపు మాధురి లావణ్య, దుర్గ గుడి ధర్మకర్త కట్టా సత్తెయ్య, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేరంగుల వెంకట రమణ, గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షుడు కేసరి కృష్ణారెడ్డి, శ్రీశైలం దేవస్థానం ధర్మకర్త గురుమహంతు మహేష్, వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రాఘవ నరసింహారావు బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

డయల్ యువర్ సీపీకి 10 ఫిర్యాదులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రజా సమస్యల సత్వర పరిష్కార వేదికగా శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమంలో 10 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ టీకే రాణా నేరుగా బాధితులతో మాట్లాడి ఫిర్యాదులు తీసుకున్నారు. అందులో ట్రాఫిక్ సమస్యలు, అసాంఘిక శక్తుల గురించి, కుటుంబ కలహాల గురించి, ఆర్థిక నేరాలు, స్థలం తగాదాలు తదితర 10 సమస్యలపై ఫిర్యాదులు అందాయి. సంబంధిత పోలీస్ స్టేషన్ల యస్‌హెచ్‌ఓలు, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాల్సిందిగా టీకే రాణా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నేరుగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను సత్వరమే పరిష్కారించడంతో పాటు ప్రజల్లో పోలీసుల పట్ల విశ్వాసాన్ని కల్పించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సీపీ టీకే రాణా

సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపులు

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరపాలక సంస్థకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి పన్ను, డ్రైనేజి పన్ను, వాటర్ మీటర్ పన్నులను మొదటి అర్ధ సంవత్సరం ముగుస్తున్నందున పన్నులు చెల్లించేందుకు వీఎంసీ ప్రత్యేక క్యాష్ కౌంటర్లను ఏర్పాటు చేసిందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల సౌకర్యార్థం వీఎంసీ మూడు సర్కిళ్ల పరిధిలో ఆయా క్యాష్ కౌంటర్లు సెలవు దినాల్లోనూ పనిచేస్తాయని పేర్కొన్నారు. ఈ నెలలో 24న ఆదివారం, 28న మిలాదున్ నబి రోజున కూడా ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని అన్నారు.